నేడు ఉచిత మధుమేహ పరీక్షలు

చిక్కడపల్లి: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హెల్త్‌సిటీ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని శ్రీ సాయిడయాగ్నస్టిక్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత మధుమేహ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు, డయాబెటిక్ చైర్మన్ జీకే రమణ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 040-27607687లో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడా రంగంలో రాణించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం రాంనగర్ సెయింట్ పాయిస్ హైస్కూల్‌లో 66వ వార్షిక స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంపొందించడంతోపాటు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లిండా జరాల్డ్, ఎన్‌సీసీ అధికారి మేజర్ జయసుధ, విద్యామండలి మాజీ డిప్యూటీ డీఈవో చిరంజీవి, నందిని, నక్షత్ర పాల్గొన్నారు.

7, 8 తేదీల్లో వైఎంసీఏ వాలీబాల్ టోర్నమెంట్

కాచిగూడ: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో నారాయణగూడ వైఎంసీఏ గ్రౌండ్స్‌లో విద్యార్థినీ విద్యార్థులకు డాక్టర్ నందన్ సింగ్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎం. ప్రిస్టీలీ గైస్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే 17 ఏళ్ల లోపు విద్యార్థులు ఈ నెల 6వ తేదీలోగా వైఎంసీఏలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్: 77996 64455, 70326 60614 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

'షెబ్ ఏ బరాత్'కు ఏర్పాట్లు చేయాలి



జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్నమహ్మద్ అలీ, పర్వేజ్

ముషీరాబాద్: ఈ నెల 13న ముస్లింలు పవిత్రంగా జరుపుకునే షెబ్ ఏ బరాత్ పండుగకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మసీదుల వద్ద ఏర్పాట్లు చేయాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, ముషీరాబాద్ బీఆర్‌ఎస్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ పర్వేజ్, అఖ్లక్ హుస్సేన్, నాయకులు అబ్బూ, సర్వర్, ఫిరోజ్‌ఖాన్ జోనల్ కమిషనర్‌ను కలిసి మాట్లాడారు.

త్యాగరాజ కీర్తనలు సంగీత ప్రాధాన్యం

చిక్కడపల్లి: అన్నమాచార్య సంకీర్తనలు సాహిత్య ప్రధానం కాగా త్యాగరాజ స్వామి కీర్తనలు సంగీత ప్రధానమని దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు డాక్టర్ పి.మధుసూదనరావు అన్నారు. శనివారం రాత్రి శ్రీ త్యాగరాయ గానసభలోని లలిత కళావేదికపై ప్రముఖ మహిళా సాంస్కృతిక సేవా సంస్థ రాగ రాగిణి 18వ వార్షిక వేడుకల సందర్భంగా దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఆంధ్ర మహిళా సభ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చైర్‌పర్సన్ డాక్టర్ వై.రమాప్రభ బృందం త్యాగరాజ స్వామి పంచరత్న కీర్తనలు గోష్టి గానంతో శ్రోతలను పరవశులను చేశారు. అనంతరం జరిగిన సభ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ మధుసూదన్‌రావు శాలువా జ్ఞాపికతో రమాప్రభ సత్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బోయి భీమన్న సాహిత్య నిధి అధ్యక్షులు హైమవతి భీమన్న , మైథిలీ కిడాంబి, సంస్థ అధ్యక్షురాలు రమణకుమారి, కార్యదర్శి సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

వార్షికోత్సవం

సుందరయ్య విజ్ఞానకేంద్రం: ఫస్ట్ క్రై ఇంటలిటూట్స్ ప్రీప్రైమరీ సైదాబాద్ 4వ వార్షికోత్సవం శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఆటపాటలతో ఎంతగానో అలరించారు. ఆధునిక, సంప్రదాయ నృత్యాలతోపాటు ఏకపాత్రాభినయం తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో అదరహో అనిపించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయునీలు పాల్గొన్నారు.

కొంత మోదం.. కొంత ఖేదం

కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పరిమితి 12 లక్షలకు పెంపుపై హర్షం

పెదవి విరిచిన అన్ని రాజకీయ పార్టీలు

పార్లమెంట్‌లో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కొంత మందికి ఆమోదంగా, మరికొంత మందికి వ్యతిరేకంగాను ఉంది. బీజేపీ, దాని అనుబంధ ప్రజాసంఘాలు కేంద్ర బడ్జెట్ పట్ల హర్షం వ్యక్తం చేస్తుండగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్, వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు పెదవి విరుస్తున్నాయి. ఇది కేవలం కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన బడ్జెట్ అని తెలుగు రాష్ట్రాలకు మొండి చేయి చూయించారని విమర్శిస్తుండగా పన్ను మినహాయింపులో ఆదాయ పరిమితిని పెంచి పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించారని బీజేపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. – ముషీరాబాద్

8 మంది ఎంపీలున్నా మొండిచేయి: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్



రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను ప్రజలు గెలిపించారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు. అయినప్పటికి బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు ఘోరంగా విఫలమయ్యారు. తెలంగాణ ప్రజల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందనడానికి ఇదే నిదర్శనం. తక్షణమే ఎంపీలు, కేంద్ర మంత్రులు కేంద్ర బడ్జెట్‌పై ప్రజలకు సంజాయిషీ ఇవ్వాలి.

మధ్య తరగతికి ఊరట: కౌండిన్య ప్రసాద్, మెడికల్ రిప్రెజెంటేటివ్



12 లక్షల వరకు ఆదాయపు పన్ను మినహాయింపు వల్ల అల్పాదాయ, మధ్య తరగతి వర్గాలకు పెద్ద ఊరట కలిగిస్తుంది. 36 రకాల ప్రాణాధార మందులపై విదేశాల నుంచి దిగుమతి ట్యాక్స్ మినహాయింపు, కేన్సర్ మందులపై ట్యాక్స్ మినహాయింపు వల్ల రోగులకు ఊరట కలుగుతుంది.

సంక్షేమానికి పెద్దపీట: సాయికృష్ణయాదవ్, బీజేపీ



ప్రధాని బడ్జెట్ దేశాభివృద్ధికి, పేదల సంక్షేమానికి ఎంతగానో దోహదం చేస్తుంది. రెండు ఇండ్లు ఉన్న పేదలకు ట్యాక్స్ మినహాయింపు ఇవ్వడం హర్షణీయం. దేశ రక్షణ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి బడ్జెట్‌లో ప్రాధాన్యతను కల్పించారు.

ఎన్నికలున్న రాష్ట్రాలకు వరాలు: నాగేష్‌ముదిరాజ్, బీఆర్‌ఎస్



ఎన్నికలున్న రాష్ట్రాలకు వరాలు కురిపించారు. ఎన్నికలు లేని రాష్ట్రాల పట్ల వివక్ష చూయించారు. దేశం అంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం బాధాకరం. ఏడాది కాలంలో 30 సార్లు ఢిల్లీకి వెళ్లి ఏం సాధించారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలి.

బహుళ జాతి సంస్థలకు అనుకూలం: గోవర్ధన్, న్యూ డెమోక్రసీ



కేంద్ర బడ్జెట్ బహుళ జాతి వర్గాలకు అనుకూలమైన బడ్జెట్. మైనార్టీ ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంక్షించడంలో ఈ బడ్జెట్ వైఫల్యం చెందింది. రాష్ట్రానికి పూర్తిగా మొండిచేయి చూపించారు. తెలంగాణ ప్రజలను కేంద్రం అవమానించినట్లు ఉంది.

కొత్త సీసాలో పాత సారా: ఎం.నర్సయ్య, టీజేఎస్



కేంద్ర బడ్జెట్ కొత్త సీసాలో పాత సారా మాదిరిగా ఉంది. అంకెల గారడి తప్ప అసలైన అభివృద్ధికి ఆనవాళ్లు లేవు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు మొండిచేయి చూయించారు. ఎన్నికలు ఉన్న బిహార్ రాష్ట్రానికే అధికంగా ప్రాధాన్యత ఇవ్వడం చూస్తుంటే ఇది ఎన్నికల బడ్జెట్ మాదిరిగా ఉంది.

'ఫీజు' బకాయిల విడుదల కోరుతూ ర్యాలీ

- ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నిరసన
- చలో సెక్రటేరియెట్‌ను అడ్డుకున్న పోలీసులు..

కవాడిగూడ: గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల మెనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సూర్యనారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ కళాశాలలను మూసివేసే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫీజు బకాయిలను విడుదల చేయాలంటూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం చలో సెక్రటేరియట్ పిలుపునివ్వగా పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసుల అనుమతితో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ రెగ్యూలర్‌గా చెల్లించేవారని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడతలవారీగా చెల్లించేదని గుర్తు చేశారు. కానీ నూతనంగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి యాద రామకృష్ణ, కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీధర్ రావు, పరమేశ్వర్, కోశాధికారి శంకర్, కాకతీయ వర్సిటీ అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, ఉస్మానియా వర్సిటీ అధ్యక్షులు సీతారాంరెడ్డి, మహాత్మాగాంధీ వర్సిటీ అధ్యక్షులు నాగేందర్‌రెడ్డి, శాతవాహన వర్సిటీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, పాలమూరు వర్సిటీ అధ్యక్షులు నారాయణగౌడ్, తెలంగాణ వర్సిటీ అధ్యక్షులు సంజీవరెడ్డి పాల్గొన్నారు.

ఆయుర్వేదంపై అవగాహన శిబిరం



బర్కత్‌పురలో జరిగిన ఆయుర్వేద వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కాచిగూడ: ఆయుర్వేద వైద్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అవగాహన, వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జీవశ్రీ ఎండీ ఫణిశ్రీ కొంటే తెలిపారు. కాచిగూడలోని జీవశ్రీ ఆయుర్వేద సెంటర్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఆరోగ్యంలో ఆయుర్వేద వైద్యం ప్రధాన పాత్ర పోషిస్తోందని అన్నారు. ఆయుర్వేద వైద్యంలో పరిశోధనలు మరింత పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పని ఒత్తిడి, పెయిన్ మెనేజ్‌మెంట్, అధిక బరువు నియంత్రణ, గైనకాలజీ సమస్యలతోపాటు మాతృరక్ష, వామనం, విరేచనం, వాస్తి, రక్తమోక్షసం, ప్రజలకు ఎలాంటి వైద్యం అవసరమో తెలుసుకుని నిబంధనలకు అనుగుణంగా తమ హాస్పిటల్స్‌లో వైద్యసేవలు అందిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సత్యదీప, డాక్టర్ సునీత గ్రేస్, మార్కెటింగ్ మేనేజర్ ఎ.మల్లికార్జున్ యాదవ్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

పేద, మధ్య తరగతికి అనుకూల బడ్జెట్

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు



కాచిగూడ: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ పేద, మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగుల అనుకూల బడ్జెట్ అని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. శనివారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం చరిత్రాత్మకమని పేర్కొనినారు. దేశంలో పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని బడ్జెట్ రూపకల్పన చేశారని, ఇది ప్రజల ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు దోహదపడుతుందని అన్నారు. దీర్ఘకాల వ్యాధులకు సంబంధించిన మందులపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం ప్రజల ఆరోగ్యంపై నరేంద్రమోదీ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. చిరు వ్యాపారుల నుంచి పారిశ్రామిక వేత్తల వరకు రుణ పరిమితి పెంచి ఆర్థిక చేయూతను అందించడం విశేషమన్నారు. ప్రజల సంక్షేమానికి నిధులు కేటాయించడం, సంక్షేమ రంగాల అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలు నవభారతానికి నాంది అని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం

చిక్కడపల్లి: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంలోని కార్మిక, రైతాంగ, వ్యవసాయ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందంటూ సీఐటీయూ, రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో బడ్జెట్ ప్రతులను శనివారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రైతు రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు మాట్లాడారు. సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల్లో ఉపాధి కల్పన, కార్మిక భద్రతకు సంబంధించిన అంశాలు ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకుల భూపాల్, వీఎస్‌రావు, ఎస్వీ రమణ, జయలక్ష్మి, వెంకటేష్, వంగూరి రాములు, శ్రీకాంత్, సుధాకర్, సునీత, సోమన్న, కోటంరాజు, ప్రసాద్, పద్మ, ఆంజనేయులు, భానుకిరణ్, రాజు భట్, కుమారస్వామి, యాదమ్మ, మల్లేష్, రాములు, సందీప్‌లు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో బీసీలను విస్మరించిన కేంద్రం'

కాచిగూడ: కేంద్ర బడ్జెట్‌లో బీసీలను బీజేపీ ప్రభుత్వం విస్మరించిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. శనివారం కాచిగూడలో కేంద్ర బడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, ఆర్థిక అసమానతలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజల సంక్షేమం కంటే కార్పొరేట్ల లాభాలకే ప్రాధాన్యత ఇచ్చిందని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీలకు ఎలాంటి నిధులు కేటాయించకుండా మరోసారి మోసం చేసిందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ ఆందోళన, నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలి



బిజినెస్ స్కూల్ కాన్వకేషన్‌లో సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రొఫెసర్ డి.శ్రీరాములు

కాచిగూడ: సమాజంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులు, సవాళ్లను ఎదుర్కొనేందుకు యువత సిద్ధంగా ఉండాలని ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీరాములు అన్నారు. శనివారం బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి బిజినెస్ స్కూల్ 10వ బ్యాచ్ కాన్వొకేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను సొంతం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. భవిష్యత్‌లో ఉద్యోగంతోనే స్థిరపడకుండా స్టార్టప్స్ ద్వారా మరిన్ని మంచి అవకాశాలతో వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా మారి మరికొంత మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేస్థాయికి ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సునీల్, ప్రిన్సిపాల్ ప్రసన్నరేఖ, డాక్టర్ మోహన్ కుమార్, మల్లికార్జున్, ఆఫ్తా సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

హెబ్రోన్ చర్చి సంక్షోభంపై శ్వేతపత్రం

ముషీరాబాద్: కొంతకాలంగా గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలో జరుగుతున్న పరిణామాలపై వివిధ చర్చిల ప్రతినిధులు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. శనివారం కళిష్ ఫంక్షన్ హాల్‌లో ప్రవీణ్ పగడాల అధ్యక్షతన నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చర్చిల ప్రతినిధులు సమావేశమయ్యారు. అనంతరం ఇండిపెండెంట్ చర్చస్ అధ్యక్షుడు డాక్టర్ వై.మోహన్‌బాబు మాట్లాడుతూ హెబ్రోన్ చర్చితో సంబంధం లేని రాగి వీరాచారి అనే వ్యక్తి నకిలీ పత్రాలను సృష్టించి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆమోదం కోసం సమర్పించారన్నారు. అయితే అవి ఇంతవరకు ఆమోదం పొందలేదని, నకిలీపత్రాలను కోర్టుకు చూపి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకొని 2017లో సంఘాన్ని అధీనంలోకి తీసుకున్నారని తెలిపారు. విశ్వాసులను బెదిరిస్తూ సంఘం ఆదాయాన్ని అక్రమంగా కాజేస్తుండటంతో సభ్యులు 2024 సెప్టెంబర్‌లో వీరాచారి అనే వ్యక్తిని హెబ్రోన్ చర్చి నుంచి బయటకు పంపించారన్నారు. గత నెల 23న వీరాచారి, వంద మంది అనుచరులు చర్చిలో చొరబడి సంఘపు వ్యక్తులపై దాడి చేసి 1.17 కోట్ల సొమ్మును తీసుకువెళ్లారని ఆరోపించారు. వీరాచారిని చర్చి నుంచి బయటకు పంపి అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. హెబ్రోన్ చర్చి కార్యక్రమాలు సజావుగా సాగడానికి స్వయం ప్రతిపత్తి కలిగిన పెద్దలతో కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రెవరెండ్ భాస్కరాయా, బిషప్ జాన్ గొల్లపల్లి, రెవరెండ్ ప్రసాద్ చౌదరి, రెవరెండ్ జోనాతన్ ఎడ్వార్డ్స్, రెవరెండ్ డాక్టర్ గేరా ఇసాక్, బ్రదర్ జాన్ స్టివర్ట్ తదితరులు పాల్గొన్నారు.

3న 108 కలశాలతో ప్రత్యేక పూజలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఈ నెల 3వ తేదీన వసంత పంచమి, బాగ్‌లింగంపల్లి సాయిబాబా దేవాలయం 20వ వార్షికోత్సవం పురస్కరించుకొని 108 కలశాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ఉపాధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ధర్మరాజు గౌడ్ తెలిపారు. ఇదే రోజున ఆలయంలో విగ్రహ ప్రతిష్ట జరిగినందున వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

సేవాలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ నాయక్ బానోత్, దీపికా నాయక్ తదితరులు

కాచిగూడ: గోర్ బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఫిబ్రవరి 15వ తేదీని సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని గోర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిరణ్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 2024లో ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వగా, సేవాలాల్ జయంతి రోజు ఐచ్ఛిక సెలవు ప్రకటించిందని అన్నారు. అయితే గురునానక్ , మహావీర్, అంబేడ్కర్ జయంతికి ప్రకటించినట్లుగానే సేవాలాల్ జయంతిని సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ప్రభుత్వం సాధారణ సెలవును ప్రకటించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు రాజు నాయక్, సంజీవ్ నాయక్, దీపికా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సన్నాహాలు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం ఫుట్ పాత్‌పై పిల్లర్ ఏర్పాటు చేసిన దృశ్యం

నల్లకుంట: నల్లకుంట మెయిన్ రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ బరోడా బిల్డింగ్‌పై అంతస్థులో కొందరు ఓ ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. అయితే ఆసుపత్రి విద్యుత్ అవసరాలకు అక్కడ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసుకునేందుకు భవన యజమానికి స్థలం లేదు. దీంతో స్థానికంగా ఉన్న ఓ బడా నేతతో మాట్లాడి అనధికారిక ఒప్పందం కుదుర్చుకొని ఫుట్‌పాత్‌పై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలు పెట్టారు. ఇటీవల ఓ సిమెంట్ పిల్లర్‌ను నిర్మించి దానిపై ట్రాన్స్‌ఫార్మర్ అమర్చేందుకు వీలుగా స్లాబ్ వేయించాడు. అయితే స్థానికులు కొందరు అభ్యంతరం చెబుతూ నాలుగు రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16 డీసీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. రోజులు గడుస్తున్న అధికారుల నుంచి స్పందన రాకపోవడంతో స్థానికులు విషయం మీడియా దృష్టికి వచ్చారు. ఈ విషయమై డీసీ మారుతి దివాకర్‌ను వివరణ కోరగా ఫుట్‌పాత్‌పై అక్రమ నిర్మాణం చేపడుతున్నారని తేలితే వెంటనే తొలగింపచేస్తామని డీసీ చెప్పారు.

ఆక్రమణల తొలగింపు పూర్తి





మార్కెట్ రోడ్డులో వాహనదారులను అప్రమత్తం చేస్తున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బంది

శంకరమఠం మార్కెట్ రోడ్డులో వ్యర్థాల తొలగింపు

నల్లకుంట: నల్లకుంట శంకరమఠం కూరగాయల మార్కెట్‌లో రోడ్డు కిరువైపులా ఆక్రమించి ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, తాత్కాలిక షెడ్‌లను అధికారులు పూర్తిగా తొలగించారు. శుక్రవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలు తొలగించగా, రోడ్డు పక్కన వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. దీంతో శనివారం ఉదయం రెండు పొక్లెయిర్ వాహనాలతో అక్కడికి చేరుకున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది వ్యర్థాలను పూర్తిగా తొలగింపచేశారు. వ్యర్థాల తొలగింపు నేపథ్యంలో వాహనదారులకు ఎలాంటి ప్రమాదం జరుగకుండా నల్లకుంట ట్రాఫిక్ పోలీసు సిబ్బంది అక్కడే ఉండి ట్రాఫిక్ నియంత్రణ చేపడుతూ జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సహకారమందించారు.

భవన నిర్మాణ'దారులు'

- సామగ్రితో రోడ్డును మూసేస్తున్న వైనం
- వాహన రాకపోకలకు వీల్లేకుండా ఆక్రమణ
- చూసీచూడనట్లు వదిలేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు



న్యూ నల్లకుంటలో ఓ ఇంటి ముందు నిర్మాణ సామగ్రిని వేసి రోడ్డును బ్లాక్ చేసిన దృశ్యం

నల్లకుంట: భవన నిర్మాణదారులు అంతర్గత రహదారులపై యథేచ్ఛగా సామగ్రి నిల్వ ఉంచుతున్నారు. నడి రోడ్లపై కూడా ఇసుక, కంకర, సిమెంట్ రాడ్లు దర్శనమిస్తున్నాయి. నల్లకుంట డివిజన్ పరిధిలోని చాలా ప్రాంతాల్లో నూతనంగా ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు చేపట్టేవారు నిర్మాణ సామగ్రిని రోడ్లపైనే నిల్వ ఉంచడమే కాక, ఇరువైపులా వాహనాల రాకపోకలను నిలిపివేస్తూ అనధికారికంగా రోడ్లను మూసేస్తున్నారు. నిర్మాణ సామగ్రిని నెలల తరబడి రోడ్లపైనే ఉంచుతూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిస్తున్నారు. శివం రోడ్డు పపాజీ దాబా పక్క లేన్ నుంచి న్యూ రామాలయం వెళ్లే వైపు 30 అడుగుల రహదారిలో ఓ వ్యక్తి భవన నిర్మాణం కోసం నిర్మాణ సామగ్రిని తీసుకొచ్చి రోడ్డుపైనే కుప్పలుగా పోయించాడు.వాహనాల రాకపోకలు సాగించకుండా రోడ్డుకు ఇరు వైపులా పెద్ద కర్రలు ఏర్పాటు చేయించాడు. దీంతో ఆ వీధి గుండా వెళ్లాల్సిన ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలను వేరే మార్గంలోకి మళ్లిస్తున్నారు. నీసం పాదచారులు వెళ్లేందుకు కూడా దారి లేకుండా చేస్తున్నారు. ఇసుక, కంకర, ఇసుప రాడ్లు తీసుకు వచ్చే లారీలతో అంతర్గత రహదారులపైనున్న డ్రైనేజీ మ్యాన్ హోళ్ల మూతలు పగిలిపోతున్నాయి. రోడ్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు గానీ, ట్రాఫిక్ పోలీసులు గానీ ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. భవన యజమానుల వద్ద పెద్ద మొత్తంలో ముడుపులు పుచ్చుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డు ఆక్రమణలపై నోరుమెదపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, ఓ ప్రజాప్రతినిధి అనుచరులు అండదండగా ఉంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. భవన నిర్మాణాలు మొదలు పెట్టే సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనాలతో అక్కడ వాలిపోతున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది యజమానులను వివిధ ఆంక్షలతో భయాందోళనలకు గురి చేసి తమ దారికి తెచ్చుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా అంతర్గత రహదారులపై నున్న భవన నిర్మాణ సామగ్రిని తొలించాలని, వాహనాల రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోసం టౌన్ ప్లానింగ్ ఏసీపీకి 'సాక్షి'ఫోన్ చేయగా ఆ అధికారి స్పందించలేదు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383